బడ్జెట్ లేదు.. బిల్లుల్లేవు

- గ్రామాల్లోని గ్రంథాలయాలకు అందని నిధులు
- సెస్సు సంస్థకు కాకినాడ కార్పొరేషన్ రూ.9కోట్ల బకాయి
- కష్టంగా మారిన కేంద్రాల నిర్వహణ
- శ్రద్ధ చూపని కార్పొరేషన్

బాలాజీచెరువు: నవంబర్ వస్తే గ్రంథాలయ వారోత్సవాలు, మే నెల వస్తే వేసవి శిక్షణ శిబిరాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేస్తున్న ప్రభుత్వం వాటి నిర్వహణకు బడ్జెట్ విడుదల చేయడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది. గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించి బిల్లులు ఇప్పటికీ చెల్లించకపోగా తాజాగా ఇప్పుడు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహణకు కనీసం బడ్జెట్ ఉసెత్తకుండా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. వారోత్సవాల నిర్వహణకు గ్రంథాలయ గ్రేడ్ బట్టి రూ.8వేల నుంచి రూ.15 వేల వరకూ ఇస్తుంది. దాదాపు 8 రోజుల పాటు నిర్వహించే వీటికి ఇవి ఏ మాత్రం సరిపోగా దాతలను ఆశ్రయించి ఏదో రకంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నిర్వహణకు ఇచ్చే కొద్దిపాటి నిధులను దాదాపు ఆరు నెలలు గడచిన ఇవ్వకపోవడంతో గ్రంథాలయ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సెస్సు చెల్లించకపోవడంతో..

ఇదంతా ఒక ఎత్తు అయితే గ్రంథాలయాల అభివృద్ధికి సెస్సు వసూలు చెల్లించకపోవడం అభివృద్ధికి అడ్డంకిగా మారింది. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న సెస్సు సంస్థకు అందితే అభివృద్ధి పనులు, వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు వీలవుతుంది. గ్రంథాలయాలకు వచ్చేవారంతా నిరుద్యోగులు, పోటీ పరీక్షల సామగ్రి, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. అయితే సెస్సు నిధులు అందనందున అధికారులు దీనిపై స్పష్టమైన చర్యలు చేపట్టలేకపోతున్నారు. ఫలితంగా గ్రంథాలయాలు నీరసించుపోతున్నాయి. జిల్లాలో ఉన్న గ్రామ పంచాయతీలు, మున్సిపల్, కార్పొరేషన్లు గ్రంథాలయ సెస్సు సంస్థకు జమ చేయకపోవడంతో బకాయిలు లక్షల్లో పేరుకుపోతున్నాయి. ఎన్నిసార్లు అధికారులు మొరపెట్టుకున్న చెల్లించకపోవడంతో గ్రంథాలయాలకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. నగరంలో గ్రేడ్-1 రెండు, గ్రేడ్ -2 గాంధీనగర్, శ్రీనగర్, గ్రేడ్ -3 జగన్నాథపురం, గ్రేడ్-4 రామకృష్ణారావుపేటలో గ్రంథాలయాలు ఉండగా పుస్తక నిక్షిప్త గ్రంథాలయాలు(బీడీసీలు) 5 వరకూ ఉన్నాయి. బీడీసీల నిర్వహణకు ఒకొక్కదానికి ప్రతి నెలా రూ.1500 సంస్థ చెల్లించేవారు. దానిని గత ప్రభుత్వ హయాంలో రూ.4 వేలకు పెంచి బీడీసీలకు మరింత చేయూతనిచ్చారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ స్థాయిలో నూటికి ఎనిమిది రూపాయలు సెస్సు రూపంలో వసూలు చేస్తారు. పన్నులు వసూలు చేసేటప్పుడు గ్రంథాలయ సెస్సు వసూలు చేసి వాటిని తిరిగి జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాలి. అయితే సెస్సు వసూలు ప్రతి ఏడాది ప్రజల నుంచి స్థానిక సంస్థలు వసూలు చేసుకుంటున్న వాటిని అదే తరహాలో ప్రతి ఏడాది గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సి ఉన్నా తిరిగి చెల్లించలేదు. పంచాయతీల నుంచి దాదాపు రూ.16కోట్లు బకాయిలు ఉండగా కాకినాడ కార్పొరేషన్ నుంచి రూ.9కోట్ల రావలసి ఉంది.

సెస్ చెల్లింపుతోనే సౌకర్యాలు



గ్రంథాలయాలకు చెల్లించాల్సిన సెస్సుపై ఆయా స్థానిక సంస్థలకు నోటీసులు ఇస్తున్నాం. దీనిపై ఏ విధమైన సమాధానం రావడం లేదు. ప్రజల నుంచి వసూలు చేసే పన్నులో ప్రతి ఏడాది గ్రంథాలయ వాటా సక్రమంగా తమకు చెల్లిస్తే కోట్ల రూపాయలలో బకాయిలు ఉండవు గ్రంథాయాల్లో మెరుగైన సదుపాయాలు, సౌకర్యాల కల్పనకు నిధులు అవసరం ఉంది.

– వీఎల్ఎస్ఎస్వీ ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి



జిల్లా గ్రంథాలలయ సంస్థ కార్యాలయం

దేశ రక్షణకు పౌరులు త్యాగాలకు సిద్ధం కావాలి



రమణయ్యపేటలో సింధూర్‌కు మద్దతుగా భారత్ జెండాతో నినాదాలు

కాకినాడ రూరల్: ఇండియా–పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశ రక్షణకు పౌరులు త్యాగాలకు సిద్ధంగా ఉండాలని వాయుసేన రిటైర్డ్ ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పిలుపు ఇచ్చారు. ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్ర శిబిరాలను భారత్ ధ్వంసం చేయడంపై బుధవారం రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకున్నారు. దేశ జెండాను పట్టుకుని జై భారత్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనగేష్ మాట్లాడుతూ పాకిస్థాన్ సరిహద్దు రాష్ట్రాలైన జమ్మూ కాశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీ తదితర రాష్ట్రాలలో యుద్ధ పరిణామాలు ఉండే అవకాశం ఉందని, దక్షణాది రాష్ట్రాలకు ఆ ఇబ్బంది ఉండకపోవచ్చని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైరన్ శబ్దం పెంచుతూ తగ్గుతూ ఉండే శత్రు విమానాలు మన మీద దాడి చేయబోతున్నట్టు సంకేతమని, సైరన్ ఆగకుండా మోగుతూ ఉంటే అంతా క్లియర్ అని సంకేతమన్నారు. వైద్యుడు అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్న ప్రసాద్, పెండెం శ్రీదేవి, రవిశంకర్ పట్నాయక్ పాల్గొన్నారు.

కరపలో మాక్ డ్రిల్




కరపలో జరిగిన మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు

కరప: భారత్, పాకిస్థాన్ దేశాలమధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై బుధవారం కరపలో ''సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్'' నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదురుగా పంచాయతీరాజ్, రెవెన్యూ, వైద్య,ఆరోగ్యశాఖ ఉద్యోగులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, ఎంపీడీఓ ఎం.అనుపమ, అగ్నిమాపకశాఖ ప్రతినిధి నరేష్ మాట్లాడుతూ యుద్ధం అనివార్యమైతే వైమానిక దాడులు జరిగే అవకాశముంటుందని ఆ సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. వైమానిక దాడులు జరుగుతాయని సమాచారం రాగానే జిల్లా యంత్రాంగం సైరన్ మోత ద్వారా ముందుగానే తెలియజేయాలన్నారు. అప్పుడు వెంటనే ప్రజలు బహిరంగ ప్రదేశాలను విడిచిపెట్టి సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలన్నారు. రాత్రిసమయంలో సైరన్ మోత వినపడగానే ప్రజలు అప్రమత్తమై తమను తాము రక్షించుకోవడానికి ఎవరి ఇళ్లల్లో వారు లైట్లు, గ్యాస్ స్టవ్‌లు, విద్యుత్ పరికరాలు, వాహనాల లైట్లు ఆఫ్ చేసి, కిటికీలను నల్ల పరదాలతో కప్పి ఉంచాలన్నారు. ఆపత్కకర పరిస్థితులలో విద్యుత్ సరఫరా నిలిపివేశారన్నారు. యుద్ధ ప్రతికూల పరిస్థితులలో షాడో, జిల్లా కంట్రోల్ రూమ్‌లు, ప్రథమచికిత్స కేంద్రాలు ఏర్పాటు, పోలీసు, అగ్నిమాపక దళాలు చేసే పనులను, ఇతర జాగ్రత్తలను వివరించి, ప్రజలకు తెలియజేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు, పీహెచ్‌సీ డాక్టర్ వి.ఏంజలిన్ తదితరులు పాల్గొన్నారు.

పౌర రక్షణపై సంసిద్ధత

బోట్‌క్లబ్: కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పౌర రక్షణ సంసిద్ధతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కొండయ్యపాలెం బ్రిడ్జి సమీపంలో యుద్ధ సమయంలో వచ్చే క్లిష్ట పరిస్థితులు నుంచి ప్రజలను ఎలా రక్షించుకోవాలో తెలియజేస్తూ మాక్ డ్రిల్ చేశారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలు తమకు తాము ఏవిధంగా రక్షించుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ భావన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల సమయంలో ప్రవర్తనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: రసాయన పరిశ్రమల పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు ప్రమాదాలు ఇతర సంక్షోభ సమయాల్లో ఏ విధంగా ప్రవర్తించాలో విస్తృత అవగాహన కల్పించాలని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు పరిశ్రమల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మల్లిబాబు ఫ్యాక్టరీస్, అగ్నిమాపకశాఖ అధికారులతో కలిసి కాకినాడ డివిజన్ పరిధిలోని 13 ప్రమాదకర పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రసాయనాలు తయారు చేసే పరిశ్రమలు చుట్టూ నివాసం ఉంటున్న ప్రజలకు అనుకోని సంఘటనలు చోటు చేసుకున్న సందర్భాల్లో ఇతర సంక్షోభ సమయాల్లో అనుసరించే విధానాలపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. చాలా సందర్భాల్లో యాజమాన్యాలు అజాగ్రత్త చర్యల వల్లనే పరిశ్రమల్లో ప్రమాదాలు కోల్పోతున్నామన్నారు. పరిశ్రమల్లో అనుకోని ప్రమాద సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు, సంక్షోభ సమయాల్లో వ్యవహరించాల్సిన విధానాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆర్డీవో మల్లిబాబు సూచించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఏ మురళీకృష్ణ, అగ్నిమాపక శాఖ అధికారి మురళీకృష్ణ, కోరమాండల్, ఏఎంగ్రీన్ అమ్మోనియా, రాక్ సిరామిక్, రిలయన్స్, ఓఎన్‌జీసీ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళి



రమణయ్యపేటలో అల్లూరి చిత్రపటానికి కమాండెంట్ నాగేంద్రరావు, తదితరులు నివాళులు



అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జేసీ రాహుల్‌మీనా



కరప హైస్కూలులో అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న పూర్వవిద్యార్థులు, గ్రామస్తులు

కాకినాడ రూరల్: దేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును స్మరించుకోవడం మన కర్తవ్యమని ఏపీఎస్పీ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని రమణయ్యపేటలో ఏపీఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమండెంట్ మన్మథరావు, ఏఓ మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వాతంత్ర్య సమర యోధుడు, విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉన్న సీతారామరాజు విగ్రహానికి మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు పూర్వవిద్యార్థులు, గ్రామస్తులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామస్తులు సాదే లోహిదాస్, దేవు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎంపీడీఓ ఎం.అనుపమ, ఏఓ బీఎల్ నరసింహం సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాకినాడ సిటీ: స్వాతంత్ర పోరాటంలో మన్యం ప్రాంతంలోని గిరిజనుల సమీకరించుకొని బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన గొప్ప పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా పేర్కొన్నారు. బుధవారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, పాడా పీడీ చైత్ర వర్షిణి ఇతర అధికారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ శ్రీనివాసరావు, సెట్రాజ్ సీఈవో మల్లికార్జునరావు, కలెక్టరేట్ ఏవో రామమోహన్‌రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

విప్లవజ్యోతి అల్లూరికి నివాళి

బోట్‌క్లబ్: విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం నాగమల్లితోట జంక్షన్ వద్ద అల్లూరి కాంస్య విగ్రహానికి క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు అడ్డూరి రామకృష్ణభాస్కరరాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీతారామరాజు కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళావేదిక కార్యదర్శి పంపన దయానందబాబు, ఎస్‌వీవీఎస్ మూర్తి, బాలప్రకాష్, టివివిఎస్ఎన్ రెడ్డి, గణపతిరాజు, జోగి జగన్నాధరాజు పాల్గొన్నారు.

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళి

బాలాజీచెరువు: ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాలలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు హాజరై భారతదేశానికి జాతీయ గీతాన్ని అందిచిన కవీ అని, ఆసియాలో నోబెల్ బహుమతి అందుకున్న మొట్టమొదటి వ్యక్తి అన్నారు. బాల్యం నుంచే అనేక రచనలు చేశారని, విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహిళ కళాశాల ప్రిన్సిపాల్ కరుణ మాట్లాడుతూ రచయిత, సంగీత వేత్త, చిత్రకారుడిగా, ముఖ్యంగా విద్యావేత్తగా పేరొంది అందరి మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

బోట్‌క్లబ్: సాంబమూర్తినగర్ ఫీడర్ విద్యుత్ మరమ్మరతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 గంటలు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆశాఖ ఈఈ ఎస్.ఉదయయ భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంబమూర్తినగర్, బాలవేంకటేశ్వర్‌నగర్, రైల్వే స్టేషన్‌రోడ్డు, వెంకటేష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శేష వాహనంపై భావనారాయణ స్వామి



సర్పవరంలో పెద్ద శేష వాహనంపై భావనారాయణ స్వామి వారి ఊరేగింపు

కాకినాడ రూరల్: సర్పవరంలో రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం స్వామివారిని తిరువీధుల్లో పెద్ద శేష వాహనంపై ఊరేగించారు. స్వామి వారు ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. గురువారం రాత్రి స్వామి దివ్య కల్యాణం వైభవంగా జరగనుంది.

ఏడాదిలో స్కీముల్లేవు అన్నీ స్కాములే



జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా స్కీములు పక్కన పెడితే స్కామ్‌ల బాట పట్టిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. స్కీములు ముసుగులో స్కాములు చేస్తూ నాయకులు తమ జేబులు నింపుకొంటున్నారని జగన్ పాలనలో ప్రతి ఒప్పందంలోను పారదర్శకత కనిపిస్తే నేడు చంద్రబాబు ప్రభుత్వంలో పారదర్శకత లోపించి దోపిడీ, మోసం కనిపిస్తున్నాయని అన్నారు. ఇసుక మాఫియా, మట్టి మాఫియా, లిక్కర్ మాఫియా, రాజధాని నిర్మాణాల్లో అంచనాలు ఊహించనంత విధంగా పెంచి ప్రజాధనాన్ని దోచుకోవడం చూస్తున్నారని తెలిపారు. తాజాగా లంచాలు తీసుకుంటూ అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకొని ప్రజలకు చంద్రబాబు షాక్ ఇచ్చారన్నారు. గృహ, వ్యవసాయం విద్యుత్ సరఫరాను తగ్గించి చార్జీలు పెంచి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. తాను అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచం ఇంకా తగ్గిస్తాం, గత జగన్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నాశనం చేసింది ఐదేళ్లలో 1.29 లక్షల కోట్లకు పైగా నష్టం జరిగింది అంటూ ఎన్నికల ముందు ఆ తర్వాత శ్వేత పత్రంలో విమర్శలు చేసిన సీఎం చంద్రబాబు ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు. లంచాల కోసం అవినీతి కోసం బరితెగించి భారీ ధరకు కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడం ద్వారా చరిత్రలోనే అతిపెద్ద స్కాంకు చంద్రబాబు ప్రభుత్వం పాల్పడుతుందని ఆమె విమర్శించారు. మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా మహిళలు ఇప్పటికే గ్రహించారని పేర్కొన్నారు.

ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్‌గా ఉమామహేశ్వరరావు



డాక్టర్ పోతుల ఉమామహేశ్వరరావు

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ పోతుల ఉమామహేశ్వరరావును నియమిస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఫోరెన్సిక్ హెచ్‌వోడీగా కొనసాగుతున్న డాక్టర్ ఉమామహేశ్వరరావు ఆర్ఎంసీ స్పోర్ట్స్ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. 1985 ఎంబీబీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన విజయవాడ సిద్దార్థ మెడికల్ కళాశాలలో వైద్య విద్య పూర్తి చేశారు. కడప, ఉప్పాడ కొత్తపల్లి, కాంద్రకోట వైద్యాధికారిగా, జీజీహెచ్ సీఎంవోగా, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆర్ఎంసీలో ఫోరెన్సిక్ పీజీ చేసి కాకినాడ, విశాఖపట్టణంలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రధానాచార్యుడి హోదాల్లో పనిచేశారు. వివిధ వర్గాల్లో డాక్టర్ ఉమామహేశ్వరరావుకి సౌమ్యుడనే పేరుంది. సమర్థత ఆధారంగా కీలకమైన వైస్ ప్రిన్సిపాల్ బాధ్యతలు ఆయనకు అప్పగించినట్లు డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు.

రైతుల్లో కలవరం



వాకాడ లేఅవుట్‌లో ధాన్యం రాశులను బరకాలతో కప్పుతున్న రైతులు

- ఆందోళనకు గురిచేస్తున్న మబ్బులు
- ధాన్యం రాశులను బరకాలతో కప్పుకుంటున్న రైతులు

కరప: ఇటీవల కురుస్తున్న వర్షాలు రైతులను కలవరపరుస్తున్నాయి. పంట చేతికందే సమయంలో వరుణుడు తన ప్రతాపం చూపడంతో విలవిల్లాడుతున్నారు. బుధవారం ఉదయం దట్టంగా మబ్బులుకమ్మి, చినుకులు పడి, మధ్యాహ్నం కొద్దిపాటి ఎండకాయడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీపంట కోతకు రావడంతో రైతులు మాసూళ్ల పనిలో నిమగ్నమయ్యారు. విచిత్ర వాతావరణంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని కలవరపడుతున్నారు. ఆదివారం కురిసిన కుండపోత వర్షానికి లేఅవుట్లలలో, కళ్లాల్లో, మళ్లల్లో ఉన్న ధాన్యంరాశులు తడిసిపోయి తీవ్రనష్టం వాటిల్లింది. తర్వాత ఎండకాస్తుండటంతో వర్షంపోయిందని రైతులు ధాన్యంరాశులు విడదీసి, ఆరపెట్టుకుంటున్నారు. మళ్లీ మబ్బులుపట్టి, చినుకులు పడుతుండటంతో పగలనక, రాత్రనక ఆరుగాలం శ్రమించి పండించిన పంట నీటిపాలు కావల్సిందేనానని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యంను రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలకు బదిలీ చేస్తూ కళాశాల విద్య డైరెక్టరేట్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చరిత్ర కలిగిన కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఇతనిపై పలు ఆరోపణలతోపాటు వివాదాలకు కేరాఫ్‌గా మారడంతో బదిలీ చేశారు. కళాశాలకు ఉన్న న్యాక్‌ఏ గ్రేడ్ బీ ప్లస్‌కు తగ్గిపోవడం, అలాగే పూర్వపు అధ్యాపకుడు నిధులు దుర్వినియోగం చేస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో పాటు ఆర్‌జేడీ హోదా అధికారులు గత నవంబర్, ఫిబ్రవరిలలో విచారణ చేపట్టారు. స్థానిక ప్రజాప్రతినిధి ఇతని పనితీరుపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడం బదిలీకు ప్రధాన కారణంగా నిలిచింది. ఇతనిని 2023లో చోడవరం కళాశాలకు బదిలీ చేయగా కోర్టును ఆశ్రయించి తిరిగి ఇదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చారు. కళాశాలకు ఎంతో మంది ప్రిన్సిపాళ్లుగా పనిచేయగా వివాదాలకు కేరాఫ్‌గా నిత్యం విద్యార్థులతోనే కాక అధ్యాపకులతో వాగ్వాదానికి దిగుతూ కళాశాలలో హాట్ టాఫిక్‌గా నిలిచేవారు. ఇవన్నీ పరిగణలోకి తీసుకుని బదిలీ చేస్తూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు అప్పగించి నూతన ప్రిన్సిపాల్ వచ్చే వరకూ కార్యకలాపాలు నిర్వహించాలని ఆదేశాలు జారీచేశారు.

క్లుప్తంగా

పశువుల షెడ్లు, రోడ్లకు శంకుస్థాపన

కాకినాడ రూరల్: కాకినాడ 2వ డివిజన్ రమణయ్యపేటలోని ఎస్‌పీసీఏ(గోశాల)లో కౌడా నిధులు రూ.2.70కోట్లతో అభివృద్ధి పనులకు బుధవారం రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) వైస్ చైర్మన్ భావన శంకుస్థాపన చేశారు. ప్రజలు విజ్ఞప్తి మేరకు గోవులు సంరక్షణ కోసం మూడు విభాగాలుగా పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసినట్టు కౌడా చైర్మన్ బాబు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కరప: గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. పెద్దాపురం మండలం కోటముండు గ్రామానికి చెందిన కంకిపూడి దేవానంద్ టైల్స్ పని చేస్తుంటాడు. కరపలో ఈనెల ఒకటో తేదీన కరపలో అతను డ్రింక్ తాగడానికి వెళ్లి తిరిగి వస్తుండగా, కరప నుంచి కాకినాడ వైపు వెళుతున్న మోటారుసైకిలిస్ట్ వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దేవానంద్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. బాధిత ఎమ్మెల్సీ రిపోర్ట్‌తో బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, 10 సదస్యం, 13న శ్రీపుష్పయాగం వైభవంగా జరుగుతుందన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా శ్రీనివాస్



కాకినాడ లీగల్: కాకినాడ అదనపు జిల్లా జడ్జి కోర్టులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా చెక్క నాగవెంకట సూర్యనారాయణ శ్రీనివాస్‌ను నియమిస్తూ న్యాయశాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ గొట్టపు ప్రతిభాదేవి ఉత్తర్వులు బుధవారం జారీ చేశారు. ఆయన విధులను మూడేళ్ల కాల పరిమితిని నిర్ణయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాకినాడలో 34 ఏళ్లుగా చెక్క శ్రీనివాస్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. కాకినాడ బార్ అసోసియేషన్‌లో రెండేళ్లు జనరల్ సెక్రటరీగా ఆయన చేశారు. చెక్క శ్రీనివాస్‌కు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామచంద్రరాజు, జనరల్ సెక్రటరీ చెక్కపల్లి వీరభద్రరావు, పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఘనంగా వాసవీ మాత జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

బాలాజీచెరువు: స్థానిక మెయిన్‌రోడ్‌లోని వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయంలో జయంతి వేడుకలు ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. నగరంలో ఉన్న ఆర్యవైశ్య సంఘాలు, ఆర్యవైశ్య మహాసభ, వాసవీ క్లబ్ కాకినాడ, వాసవీక్లబ్ కేజీజీఎఫ్ కాకినాడ, వాసవీ క్లబ్ సర్పవరం, వైఎంవీఏ, అవోగా ఆర్యవైశ్య సంఘాలు ఆధ్యర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గ్రంధిబాబ్జి, 30 వార్డు ఇన్‌చార్జి బచ్చుశేఖర్, దంగేటిసతీష్, అద్దేపల్లి గంగరాజు, బచ్చుప్రభు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సులతో మహిళలకు ఉపాధి

బోట్‌క్లబ్: మహిళలు స్వయం ఉపాధికి కోసం బ్యూటీషియన్ కోర్సులు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయని ఐబీహెచ్ఎస్ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యూటీ అండ్ హెయిర్ సైన్స్) అకాడమీ డైరెక్టర్లు అప్పసాని కృష్ణ కుమారి, మెట్టా రాధసరస్వతీ తెలిపారు. ఐబీహెచ్ఎస్‌లో 12వ బ్యాచ్ సర్టిఫికెట్లను బుధవారం అందించారు. గత నాలుగు సంవత్సరాల్లో 400 మంది విద్యార్థులకు స్వయం ఉపాధి పొందినట్లు చెప్పారు. మహిళలకు స్వయం ఉపాధి, మెరుగైన అవకాశాలు, నైపుణ్యాలు అందించడానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం బీడబ్ల్యూఎస్ఎస్‌సి (బ్యూటీ అండ్ వెల్‌నెస్‌సెక్టార్ స్కిల్ కౌన్సిల్) సర్టిఫికెట్ కోర్సు ద్వారా బ్యాంకు రుణాలు పొందేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు.